
# మొర

— బుధ




**రాఘవరావు 'యుడీసీ'గా రిటైర్ అయ్యాడు. ఆ రోజు ఆఫీసులో జరిగినవి గుర్తుచేసుకున్నాడు.**

**చివరి రోజు పెన్షన్ పేపర్లు తన సీటు నుండి కదిలించడానికి ఒక్కొక్క పేపరుకు నూరు రూపాయలు పుచ్చుకున్నాడు.**

"పాతిక తీసుకునేవారు ఏకంగా నూరంటే ఎలాగండీ!" జుట్టు నెరసిన ఒక పెన్షనర్ ప్రాధేయపడ్డాడు.

"చూడండీ! నేను ఈ రోజు రిటైర్ అవుతున్నా... ఇక నేను ఎంత తిన్నా ఈ సాయంత్రం ఆరు గంటల వరకే. ఆరు గంటలకు సెండాఫ్ పార్టీ యిచ్చి నన్ను ఆఫీసు నుండి వన్స్ ఫర్ ఆల్ మెడబట్టి గెంటేస్తున్నారు మా స్టాఫ్. ఈ సీట్లోకి కొత్త వ్యక్తి వచ్చేందుకు ఎంతకాలం పడుతుందో ఏమో!" వ్రాసుకుంటూ తల ఎత్తకుండానే జవాబిచ్చాడు రాఘవరావు.

"దయచేసి ఒక పాతిక తగ్గించుకోండి... ఇంటి అద్దె పాతిక పెంచాడు ఇంటి వోనరు."

"మీ వెల్ విషర్ కాబట్టి చెబుతున్నా కొత్తగా వచ్చే వ్యక్తి ఏకంగా మూరే అడగొచ్చు. రెండువందలే అడగొచ్చు! లేదంటే అసలు పైసా కూడా పుచ్చుకోకుండా పని చేయకుండా నిదానం చేయవచ్చు. ఈ విషయాలన్నీనే నెందుకు మీకు చెబుతున్నానంటే నేను మీ వెల్ విషర్ కాబట్టి! అర్థమైందా!!" కాస్త విసుక్కుంటూ అన్నాడు రాఘవరావు.

"సరే! మీరంత దిగిరాకపోయినప్పుడు తప్పదు కదా! తీసుకోండి" వందరూపాయలు అందించాడు ఆ వ్యక్తి.

"మీ పేరు"

"సింహాచలం."

"కాస్త అరగంట అలా తిరిగి రండి" ఫైళ్లలో మునిగిపోయాడు రాఘవరావు.

సాయంత్రం ఆరు గంటలకు ఘనంగా జరిగింది వీడుకోలు.

రాఘవరావు కళ్లు చెమర్చాయి.

రేపటి నుండి తను ఆఫీసుకు రానక్కరలేదు.

తను ఎవ్వరి ముక్కు పిండి మామూళ్లు వసూలు చేసుకోలేడు.

అన్ని రోజులు వేచి వుండిన వయసు ఒక్కసారి మీదపడ్డట్టు అనిపించింది రాఘవరావుకు.

వంటిలోని శక్తి అంతా ఆవిరి అయిపోయినట్టనిపించింది.

ఇల్లు దగ్గర కొచ్చింది.

రాజేశ్వరి వాకిట్లోనే కనిపించింది.

తను ఈ రోజు రిటైరై వస్తానని ముందే చెప్పాడు.

నుదుటికి పట్టిన చెమట తుడుచుకున్నాడు.

ఏదో మరచి పోయినట్టు అనిపించింది.

వెంటనే గుర్తొచ్చింది. రోజా పూలు కొని తీసుకపోయేవాడు.

కానీ మరిచిపోయాడు.

జేబు తడుముకున్నాడు.

ఎత్తుగా తగిలింది. ఆ రోజు పై సంపాదన రెండు వేలు.... మామూలుగా అయితే రెండు మూడు వందలు మించేది కాదు.

"ఏమండి! ఇల్లు ఖాళీ చేయాల్ట!! మంచి నీళ్ల దగ్గర మధ్యాహ్నం నేను ఇంటావిడా ఘర్షణ పడ్డాం. బిందెనిండక పోయినా ఆవిడ వస్తూనే అడ్డు తీయాల్ట" ఆరోపిస్తూ అంది రాజేశ్వరి భర్త వెంట లోనికివస్తూ.

"రేపు నెలలో రిజిస్ట్రేషన్ వుందిగా! కొనుక్కున్న ఇంటికి వెడతామని చెప్పలేకపోయావా!" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

"రెండు నెలలుగా మీరు ఇంటి రిజిస్ట్రేషన్ వాయిదా వేస్తున్నారు... మీరు

కొన్న యిల్లు ఎవరికైనా అద్దెకిచ్చుకుంటారని అనుమానపడ్తున్నారు."

"యాభై వేలు కట్టేసి, స్టాంపు ఫీజు చెల్లించేస్తే అయిపోతుంది రిజిస్ట్రేషన్! కాస్త కాఫీ ఇవ్వు."

"పాలు తోడేశానే."

"హోటలు కెల్లి తాగొస్తాలే!" లేచాడు రాఘవరావు. బయటకొచ్చాడు.

చీకట్లు పడుతున్నాయి.

నక్షత్రాలు మినుకుమినుకుమంటున్నాయ్.

చంద్రుడు మబ్బుల చాటుకు వెళ్లాడు.

** ** ** **

రాఘవరావు రిటైరై సరిగ్గా నెల అయింది.

తన సీట్లో కూర్చున్న వ్యక్తివంక చూశాడు.

"కుర్రాడే! పర్లేదు" అనుకున్నాడు. ఆఫీసు మామూళ్ల పద్ధతులు తెలియజెప్పాలి పాపం! లేకపోతే జీవితంలో నష్టపోగలడు అనుకున్నాడు.

"కూర్చోండి!" ఎదుట వచ్చిన రాఘవ

## మొర

రావుకు కుర్చీ చూపించాడు.

"చూడబ్బాయ్! ఇంతకు ముందు నీ సీట్లో నేను వుండేవాడ్ని!..... నీకు పెళ్లయ్యిందా!!"

"నమస్తే సార్!... ఇంకా కాలేదు", వినయంగా అన్నాడు.

పర్లేదు ఒక సిగరెట్టు ప్యాకెట్టు ఇచ్చి లొంగదీసుకోవచ్చు అనుకున్నాడు రాఘవరావు.

"కూర్చోండి."

తను కూర్చొనే వున్నాడే మరెవ్వర్ని అనుకుంటూ వెనక్కు చూశాడు రాఘవరావు.

నెల క్రిందట కనబడ్డ సింహాచలం కనబడ్డాడు.

పాతిక రూపాయలు తగ్గించుకోమన్నట్టు తన్ను అడుగుతున్నట్టే అనిపించింది రాఘవరావుకు.

"కూర్చోండి సింహాచలంగారూ...అయాం యువర్ వెల్ విషర్... మీకు చేతనయినంత సహాయం చేస్తా!" ఆఫీసులో తన పూర్వపు హోదాను గుర్తుచేసుకుంటూ అన్నాడు రాఘవరావు.

"ఈయన మీకు తెల్సా సార్" కొత్తగా వచ్చిన వ్యక్తి అన్నాడు రాఘవరావుతో.

"తెల్సు!... మంచి వ్యక్తి!!... ఆయనకు ఏ విషయంలోనైనా సరే హెల్ప్ చేయండి" చనువున్నట్లు అన్నాడు రాఘవరావు.

"థాంక్స్" సింహాచలం రాఘవరావు వంక తిరిగి అన్నాడు.

"ఇదిగోండి..మీ కోసమే ఎదురుచూస్తున్నా!" అంటూ సింహాచలం చేతికి అందించాడు పెన్షన్ పేపర్లను.

"వస్తాను విజయ్" సింహాచలం వెళ్లిపోయాడు రాఘవరావు భుజంపై చేతితో తట్టి.

"నీ పేరు విజయ్ అన్నమాట!.... చూడు ఇప్పుడు పోయాడే ఆయన నాకేం కావలిసిన వ్యక్తి కాదు...మొహమాటం లేకుండా నీకు కావల్సినంత వసూలు చేసుకో... ముఖ పరిచయం బట్టి అలా అన్నానంతే!... ఈ సీట్లో వున్నన్ని రోజులూ ఈయనతో సుమారు అయిదు వందలు వసూలు చేసుకున్నాననుకో" కాస్త దగ్గరగా వొంగి అన్నాడు.

"ఈ నెల రోజులుగా నేను ఎవ్వరినుంచీ పైసా కూడా తీసుకోలేదండీ!...ఎటూ గవర్నమెంటు జీతంఇస్తూంది కదా!"

"రేపు పెళ్లయితే ఎలాగా! దీపం వుండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలోయ్!"

"మీరంతా చెబుతున్నారు...పెద్దవారు..మీ మాట కాదనడం నా కిష్టం వుండదు... కానీ మా నాన్నేమో ఎవ్వరి దగ్గిరా ఒక్క పైసా కూడా తీసుకోవద్దని చెప్పాడు. ప్చ్! సరే...మీరు అయిదు వందలివ్వండి" తాపీగా అన్నాడు విజయ్.

"అమ్మో! నీవు గురువుకే పంగనామం పెట్టే శిష్యుడిలా వున్నావే!" లోపల కాస్త భయపడ్డా బింకంగా అన్నాడు రాఘవరావు.

"లేదండీ! మీ రివ్వకపోతే అంతే!!"

"ఇల్లురిజిస్ట్రేషన్ చేయించుకోవాలి నాయనా!"

"ప్చ్! లాభం లేదండీ! నేనేమి మిమ్మల్ని లంచం అడగడం లేదు."

"మరి!"

"మా నాన్న దగ్గర పుచ్చుకున్న అయిదు వందలూ ఇచ్చేయండి చాలు."

"ఎవరూ సింహాచలంగారు మీ నాన్నా!"

"అవును...మీరు ఎంత మొర పెట్టుకున్నా వినేవారు కాదట గదా!"

"నేను మొర పెట్టుకున్నా విననంటావ్! సరే! రేపొస్తా" తలొంచుకుని రాఘవరావు బయటకొచ్చేశాడు. ●

## రష్యాలో రుణాలు

సోవియట్ యూనియన్‌లో పెట్టుబడులు రుణాల వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం అమలు ప్రారంభమయింది. ఈ ఏడాది జనవరిలో సోవియట్ ఆర్థికమంత్రిత్వ శాఖ మూడు తరహాల హుండీలను విడుదల చేసింది. మొదటిది వడ్డీలేని ప్రభుత్వ రుణ హుండీ. రెండోది అయిదు శాతం వడ్డీతో కూడిన రుణ హుండీ. మూడోది సోవియట్ ప్రభుత్వ ఖజానాకు సంబంధించిన రుణ హుండీ.

మొదటి తరహా-వడ్డీలేని ప్రభుత్వ రుణ హుండీ-పథకం క్రింద వెయ్యి కోట్ల రూబుళ్ల విలువచేసే హుండీల కొనుగోలుకు అవకాశం కల్పించారు. ఈ తరహా హుండీ కొనుక్కున్నవాళ్లు దానికి తగిన మొత్తానికి 1993 లో సరుకులు కొనుగోలు చేసుకోవచ్చు.

పోతే, సోవియట్ ఖజానాకు సంబంధించిన రుణహుండీలు జారీచెయ్యడం ఇదే ప్రథమం. యాభయి రూబుళ్ల నుంచి వెయ్యి రూబుళ్లదాకా ఈ రుణపత్రాలు సేవింగ్స్ బ్యాంకుల ద్వారా కొనుక్కోవచ్చు. ప్రతి ఒక్క రుణ పత్రంతో పాటు 16 కూపన్లు ఉంటాయి. వీటిద్వారా ఏటా హుండీ మొత్తం మీద అయిదు శాతం వడ్డీ పొందడానికి అవకాశముంటుంది. ప్రస్తుతం సోవియట్ సేవింగ్స్ బ్యాంకులు వ్యక్తిగత ఖాతాలపై మూడు శాతానికి మించి వడ్డీ చెల్లించడంలేదు. ఈ హుండీ ద్వారా మరో రెండు శాతం అధిక వడ్డీ సంపాదించుకోవచ్చన్నమాట. అంతేకాకుండా ఈ రుణపత్రాల హామీ మీద రుణాలు కూడా పొందవచ్చు.

ఇకపోతే అయిదు శాతం వడ్డీతో కూడిన రుణ హుండీలను ప్రభుత్వ సంస్థలూ, సహకార సంఘాలూ, ప్రజాసంస్థలు, క్రెడిట్ ఏజెన్సీలకు పరస్పరం ప్రయోజనకరంగా ఉండే రీతిలో-స్వచ్ఛందంగా మాత్రమే - అమ్ముతారు. ప్రస్తుతం సోవియట్ బ్యాంకులు ఆయా సంస్థల ఆస్తులపై ఏటా 0.5 శాతం వడ్డీ మాత్రమే చెల్లిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా ఏర్పాటుచేసిన రుణ హుండీలద్వారా ఈ సంస్థలకు అయిదు శాతం వడ్డీ లభిస్తుంది. అంటే పదిరెట్లు అధికంగా వడ్డీ లభిస్తుందన్నమాట. ఈ ఆదాయాన్ని ఆయా సంస్థల లాభాల మొత్తాలతో చేరుస్తారు. ఈ కొత్తతరహా హుండీలను హుండీదార్లు బ్యాంకులద్వారాగానీ ప్రభుత్వ సంస్థల ద్వారాగానీ ఇతర్లకు అమ్ముకోవడానికి కూడా వీలుంది.